


# తెలియని నీతి

చెల్లూరి సీతారాజేశ్వరరావు

హిమవంతరావు చురుగ్గా వుంటాడు. ఎదుటి వారిని వశం చేసుకునేలా మాట్లాడగలడు. ఎం. ఏ. ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంటే నిరుద్యోగి అన్నమాట ఓపిక గలవాడే కాబట్టి నేడు యాభై ఆరో యింటర్వ్యూకి హాజరవుతున్నాడు మరి.

ఇంటర్వ్యూ జరిగే చోటుకి గంట ముందుగానే హిమవంతరావు చేరుకున్నాడు. రావలసిన నలభై మంది వచ్చేశారు. అందరూ నవ్వించుకుంటూ చెట్ల క్రింద, వరండాల లోను కాలక్షేపం చేస్తున్నారు.

హిమవంతరావు కొత్త లేకుండా అందర్నీ పలకరించాడు. జోకులేసి నవ్వించాడు. ఒక్కొక్కరు ఎన్నియింటర్వ్యూలకివెళ్ళారో, ఏం చదివారో తెలుసుకున్నాడు ఈ ఉద్యోగం తప్పకుండా వస్తుందని అందరికి ఆశ పెట్టాడు. ఓ అరగంటలో హిమవంతరావు గ్రహించింది...

తనకంటె ఎక్కువ అర్హత వున్నది కామేశంకి.

వున్నది ఒకటే పోస్టు. ఛయిర్మన్ 'రూల్సు' మనిషి. అడ్డదారికి ఆస్కారం యివ్వడు. అందువల్ల కామేశాన్ని వరిస్తుంది అది.

అయితే తిరిగి పాత కథే తనది. ప్రకటనలు — అప్లికేషన్ — యింటర్వ్యూ. హిమవంతరావుకిగుండెలు పిండినట్టయింది.

ఈసారి అలస్యమయితే మేనక తనకు దక్కదు. తనుద్యోగం సంపాదిస్తేనే మేనకని యిస్తానంటున్నాడు మామయ్య.

హిమవంతరావు బయట బోర్డ్‌కి అంటించిన లిస్ట్ చూశాడు ముప్పయి తొమ్మిదో నెంబరు కామేశంది. నలభై తనది.

జాగ్రత్తగా ఆలోచించాడు!

ఇంటర్వ్యూ ఆలస్యంగా ప్రారంభమవుతుందని ప్రకటన వచ్చింది. నిరీక్షిస్తున్న అభ్యర్థులు విసుక్కున్నారు. ఛయిర్మన్ అందరికి కాఫీ, టిఫెన్లు ఏర్పాటు చేశాడు

జవాను వీరయ్య అందిస్తున్నాడు. అతడి చేతిలోని కాఫీ కామేశం పైన ఒలికింది. "వాటీజ్ దిస్?" కోపంగా అరచాడు కామేశం.

"దారిలో అడ్డంగా నిలుచున్నావు. మీద పడింది. దానికి నేనేం చెయ్యను. అలా కళ్ళెర్రజేస్తే భయపడిపోతానా?"

నువ్వు అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడం కామేశానికి తల కొట్టేసినట్లయింది. తిక్కరేగిపోయింది. "ఏం చేస్తే నీకు భయమేస్తుంది?"

"బెమ్మదేవుడికి కూడ భయపడను. నలభైయేళ్ళ సర్వీసు వుంది. ఆఫీసర్లకే దడవలేదు. నువ్వెంత? నీలాంటి వాళ్ళు లెక్కా? ఉద్యోగంకోసం తిరిగే నీకు పవురుషం పనికిరాదు. నా చేతిలో ఏం లేదనుకుంటున్నావ్? నీ జాతకం నా గుప్పెటలో వుంది."

వీరయ్య అలా వాగుతుండగా చెంప ఛెళ్ మంది. కామేశాన్ని చుట్టుప్రక్కల వారు పట్టుకోకపోతే, వీరయ్య కీ. శే. ...

అక్కడివారు సర్దిపంపారు.

వీరయ్య పోయి ఛయిర్మన్‌తో చెప్పాడు. ఛయిర్మన్ వచ్చి భోగట్టా చేశాడు. కొట్టానని కామేశం ఒప్పుకుని "నన్ను అవమానించాడు సార్! కావలిస్తే వీళ్ళని అడగండి" చుట్టూరావున్న వారిని చూపించాడు!

ఛయిర్మన్ అడిగాడు వాళ్ళని. తను కెందుకు వచ్చిన గొడవని ఎవరూ మాట్లాడ లేదు. తాము చూడలేదన్నారు.

"డిసిప్లిన్ లేని మనుషులంటే నాకు అసహ్యం. గెటవుట్. వాడు ఏదయినా అంటే మాకు రిపోర్టు చెయ్యాలి. అలగావాడిలా కొట్టేస్తావా?... శాంతం నేర్చుకో, బాగుపడతావు నువ్వు వెళ్ళచ్చు"

బతిమాలినా ఛయిర్మన్ ఒప్పుకోలేదు.

మెరిట్ ప్రకారం ఆ వుద్యోగం హిమవంతరావుకే వచ్చింది. వీరయ్యని పిలిచి వంద యిచ్చాడు.

"చాలదు సార్. కావాలని అతడితో పోట్లాడి దెబ్బతిన్నాను. నేను రెచ్చకొట్టక పోతే అతడు చెయ్యి చేసుకొనునా? మీకుద్యోగం వచ్చునా? ఉపాయం మీరు చెప్పినా, చేసింది నేనేకదండీ...మరో వంద పడేయండి."

హిమవంతరావు ఇంటికిపోతూ "ఎంపీలు, మంత్రులే కాకుండా ప్యూన్లు కూడ ఉద్యోగం వేయించగలరు!" అనుకున్నాడు.